# సాక్షి చిత్తూరు

మంగళవారం ¦ 25 ¦ జూలై ¦ 2023




**వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందనలో వచ్చే వినతుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. - 8లో



**సకాలంలో పిల్లలకు టీకాలు**

జిల్లాలోని 0–5 ఏళ్లలోపు పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. - 8లో

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| చిత్తూరు | 29 | 24 |
| తిరుపతి | 28 | 25 |
| తిరుమల | 23 | 21 |
| గూడూరు | 28 | 26 |
| నగరి | 29 | 25 |

## న్యూస్‌రీల్

### మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా విధులు

**చిత్తూరు రూరల్:** మాతాశిశు సంరక్షణే ధ్యేయంగా విధులు నిర్వర్తించాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో ఆమె సమీక్షించారు. ఆశా యాప్‌ను ప్రతిరోజూ అప్‌డేట్ చేయించాలన్నారు. ఆరోగ్య సేవలు, మాత్రల పంపిణీ, పరీక్ష వివరాలు, కుటుంబ నియంత్రణ పద్ధతులు, మాతా శిశు సంరక్షణ అంశాలను పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల వేయించడంలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. సమావేశంలో అధికారులు రేణుక ప్రభ, గుణశేఖర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### నేడు విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

**చిత్తూరు కలెక్టరేట్ :** పలు సమస్యల పరిష్కారం కోసం మంగళవారం విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం చిత్తూరులోని ఎస్టీయూ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అరికట్టడమే లక్ష్యంగా బంద్‌కు పిలుపునిచ్చినట్లు వెల్లడించారు.

### రేపు చిత్తూరులో జాబ్‌మేళా

**చిత్తూరు కలెక్టరేట్ :** చిత్తూరులోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మనోహర్, కో–ఆర్డినేటర్ షమ్స్ అక్తర్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ 18 నుంచి 32 ఏళ్ల వయసుగల ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.16,900 వేతనం ఉంటుందని వెల్లడించారు. తెలుగు, కన్నడ, తమిళ భాషలు తెలిసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్, ఆధార్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బయోడేటాతో హాజరవ్వాలని సూచించారు. ఇతర వివరాలకు 9440332708 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### కాణిపాకంలో కట్టుదిట్టంగా భద్రత



ఈఓ వెంకటేశుతో మాట్లాడుతున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు

**కాణిపాకం(యాదమరి):** కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి కట్టుదిట్టంగా భద్రత కల్పించనున్నట్లు ఏఆర్ అడిషినల్ ఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆలయ ఈఓ వెంకటేశుతో కలిసి ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించారు. స్వామివారి దర్శనానికి వేలాది మంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో భద్రత పెంచనున్నట్లు వెల్లడించారు. అనంతరం క్యూలను సందర్శించి, ఏయే ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని నియమించాలో చర్చించారు. సెక్యూరిటీ ఆడిట్‌కు చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకటనారాయణ, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### యువత ఉపాధికి శిక్షణ

**చిత్తూరు అగ్రికల్చర్:** గ్రామీణ యువతకు ఉపాధి కల్పించేందుకు నైపుణ్య శిక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీఏ పీడీ తులసి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ సీడాప్ ఆధ్వర్యంలో స్కిల్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రంలో 4 నెలల రిటైల్ సూపర్‌వైజర్ కోర్సును ఉచితంగా అందించనున్నట్లు వివరించారు. శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత భోజన వసతితో పాటు యూనిఫామ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు వంద శాతం ప్లేస్‌మెంట్ గ్యారెంటీ ఉంటుందన్నారు. ఇందుకోసం 18 నుంచి 25 ఏళ్ల డిగ్రీ, ,ఇంటర్ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను చిత్తూరులోని టీటీడీసీ కేంద్రంలో అందజేయాలన్నారు. వివరాలకు 9390504650 , 9052182074 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### 26 నుంచి బీటెక్ 'ఇంటిగ్రేటెడ్'లో అడ్మిషన్లు

**తిరుపతి సిటీ:** పద్మావతి వర్సిటీ, బ్లెకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్) స్వీడన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీటెక్ ఇంటిగ్రేటెడ్ కోర్సులో ఈ నెల 26 నుంచి అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రొఫెసర్ పి.విజయలక్ష్మి సోమవారం తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు వర్సిటీలోని సావేరి అతిథి గృహానికి బుధవారం ఉదయం 10 గంటలకు చేరుకోవాలని సూచించారు.

# చరిత్రలో నిలిచేలా పాలన

"పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి..అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలి..సమాజంలో అసమానతలను రూపుమాపాలి.. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి.. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకురావాలి.. అన్నదాతలు ఆనందంగా జీవనం సాగించాలి.. మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలి.. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలి".. ఇదే లక్ష్యంతో చరిత్రలో చిరస్థాయిగా నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడించారు.



కంగుంది సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేదికపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం తదితరులు

- పేదల అభ్యున్నతే లక్ష్యంగా నవరత్నాలు
- అర్హతే ప్రామాణికంగా పథకాలు
- ప్రతిపక్ష నేత నియోజకవర్గంలోనూ అభివృద్ధి..సంక్షేమం
- వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు
- విలువలు లేని రాజకీయాలే ఆయన నైజం
- కుప్పం పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**కుప్పం/కుప్పంరూరల్ :** శ్రీకృష్ణదేవరాయలు, వైఎస్సార్ తరహాలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చరిత్రలో నిలిచిపోతుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనియాడారు. సోమవారం కుప్పం మండలంలో నిర్వహించిన పల్లెబాటలో భాగంగా ఆయన పలు సభల్లో ప్రసంగించారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ, జలయజ్ఞం తదితర పథకాలతో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో నాలుగు అడుగులు ముందుకు వేసి అమ్మఒడి, ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన, గోరుముద్ద, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ చరిత్ర సృష్టిస్తున్నారని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకంలో 2,300 వ్యాధులను చేర్చడాన్ని పేదలు మరిచిపోలేరని చెప్పారు. ఆస్పత్రుల నుంచి వచ్చి తర్వాత విశ్రాంతి తీసుకునే సమయానికి కూడా డబ్బులు ఇచ్చి పంపుతున్న మనస్సు నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. నాడు–నేడుతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వెల్లడించారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. 14 వేల పోస్టులను భర్తీ చేసి వైద్యరంగాన్ని బలోపేతం చేశారని వివరించారు. అధికారంలోకి వచ్చి తొలి ఏడాదే 4.5 లక్షల ఉద్యోగాలు ఇచ్చి యువతను ఆదుకున్నారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోను సంక్షేమ పథకాలను క్రమం తప్పకుండా అమలు చేశారని తెలిపారు . సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు నేరుగా అందిస్తున్నారని వెల్లడించారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరో పర్యాయం ఓటు వేసి రుణం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు.

**భరత్‌కు అవకాశమివ్వండి**

కుప్పం ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ఎమ్మెల్సీ భరత్‌కు ఒక్క అవకాశమివ్వాలని మంత్రి పెద్దిరెడ్డి కోరారు. ఆయన గెలిస్తే కచ్చితంగా మంత్రి అవుతారని, కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని వివరించారు. అలాగే ఎంపీ రెడ్డెప్పను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

**చంద్రబాబు వెన్నుపోటుదారు**

చంద్రబాబు అధికారం కోసం సొంత మామ ఎన్టీఆర్‌కే వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. 35 ఏళ్లుగా కుప్పం జనంతో ఓట్లు వేయించుకుంటూ వారిని మోసం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు చెప్పుకోవడానికి ఒక్క పథకం, ప్రాజెక్టు లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్ హయాంలో పాలారు ప్రాజెక్టుకు శ్రీకారం చుడితే సుప్రీం కోర్టులో కేసు వేసి అడ్డుకున్న దుర్మార్గుడు చంద్రబాబని మండిపడ్డారు. ఎన్నికల ముందు హామీలు గుప్పించడం, తర్వాత వాటిని తుంగలో తొక్కడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా కుప్పం ప్రజలకు ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ సభ్యుడు ఏడీఎస్ శరవణ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ పాల్గొన్నారు.



మంత్రి పెద్దిరెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నేతలు



సభకు హాజరైన ప్రజలు

## 'డైట్'లో సంగీత.. సాహితీ గేయధార



సాయికృష్ణ యాచేంద్రను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

**కార్వేటినగరం :** జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో స్థానిక ఆర్‌కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ వారు సోమవారం సంగీత, సాహితీ గేయధార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర చేపట్టిన 408వ సంగీత,సాహితీ గేయధార అలరించింది. వాణి, రాణి, పాణి, వేణి పదాలతో కూడిన గేయాన్ని ఆలపించాలని పండితులు కోరగా నిషిద్ధ పదాలు, అప్రస్తుత ప్రసంగాల నడుమ ఆయన గేయధారను కొనసాగించి అష్టావధానాన్ని మరిపించారు. కాబోయే ఉపాధ్యాయులకు వారు నిర్వర్తించాల్సిన గురుతర బాధ్యతలను తమ సంగీత రాగాలతో మార్గదర్శనం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల పూర్వ విద్యార్థి, టెక్సాస్ యూనివర్సిటీ శాస్త్రవేత్త పుదూరు జగదీశ్వరన్ మాట్లాడుతూ తెలుగు సాహితీ, సంగీత, ప్రాముఖ్యాన్ని తెలియజేయడానికి అమెరికాలో యాచేంద్ర వారిచే గేయధారను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆముదాల మురళీ సంచాలకుడిగా వ్యవహరించారు. తిరుపతి డీఈఓ వి.శేఖర్ మాట్లాడుతూ డైట్‌లో ఇలాంటి మహత్తర కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, శోభరాజు, వెంకటేశ్వర్లు, హేమంతకుమార్, అసోసియేషన్ నిర్వాహకులు విజయకుమార్‌పిళ్లై, శశిధర్‌రెడ్డి, హేమాద్రి, రాజశేఖర్, రాజేష్, సుకుమార్‌రాజు, గాజుల నాగేశ్వరరావు, గుణశేఖర్, గాయత్రి, విశ్రాంత ఎంఈఓ సుకుమార్ పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

**చిత్తూరు కలెక్టరేట్ :** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ పోస్టర్‌ను కలెక్టర్ షణ్మోహన్, డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం, పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోస్టర్‌లో పొందుపరిచారన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శంకరబాబు పాల్గొన్నారు.

## వాహనమిత్ర దరఖాస్తుకు గడువు పెంపు

**చిత్తూరు రూరల్:** వైఎస్సార్ వాహన మిత్ర దరఖాస్తుకు ఈ నెల 27వ తేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులందరూ అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 'సురక్ష'తో అందరికీ సంక్షేమం



సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా

**విజయపురం (నగరి):** జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. సోమవారం పన్నూరు సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఆమె పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా మహిళలు చిరునవ్వుతో కనిపిస్తూ సంతోషంగా ఉన్నారన్నారు. ఇల్లాలు బాగుంటే ఇల్లు, ఊరు, రాష్ట్రం బావుంటాయని వెల్లడించారు. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి విషయంలోనూ మహిళలకు పెద్దపీట వేశారన్నారు. 14 ఏళ్ల అవినీతి పరిపాలన అందించిన చంద్రబాబుకు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు కనిపించడంలేదన్నారు. నవరత్నాల పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వివరించారు. అనంతరం పన్నూరులో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి రోజా ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు వ్యవసాయం దండగ అని ఎద్దేవా చేసిన నాయకులు కూడా ఇప్పుడు రైతేరాజు అంటున్నారంటే జగనన్న పాలనే కారణమని తెలిపారు. ఒక్క పన్నూరు పంచాయతీలోనే ఈ నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సుమారు రూ.22 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీ బాలాజీ, తహసీల్దార్ వెంకట్రాయులు, ఎంపీడీఓ ప్రసాద్, ఆర్‌బీకే అధ్యక్షుడు గుణశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రేవతి, ఆర్బీకే కాంట్రాక్టర్ మనోహర్‌రెడ్డి, సర్పంచ్ సునంద, ఎంపీటీసీ సభ్యులు గోవిందమ్మ, రాజగోపాల్, పన్నూరు సర్పంచ్ కుమార్, శివరాజు, భాస్కర్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, ఆశీర్వాదం, వెంకటేశులు, శేఖర్, నాగయ్య, ఆనందరాజ్, దేవఅన్బు పాల్గొన్నారు.

## శ్రీవారి దర్శనానికి 18 గంటలు

**తిరుమల:** తిరుమలలో క్యూ కాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 87,792 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి హుండీ ద్వారా రూ.4.20 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# పక్కాగా కొలుస్తూ.. హక్కు కల్పిస్తూ!

భూ వివాదాలు లేకుండా పల్లెసీమల్లో ప్రశాంతవాతావరణం కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గట్ల పంచాయితీలకు చెక్ పెట్టేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టింది. సుమారు వందేళ్ల క్రితం తయారు చేసిన భూ రికార్డులను ప్రక్షాళన చేసేందుకు నడుంబిగించింది. ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించి పక్కాగా భూముల కొలతలు తీయిస్తోంది. అత్యంత పారదర్శకంగా సర్వే చేయించి భవిష్యత్‌లో ఎలాంటి తగాదాలు తలెత్తకుండా రైతులకు శాశ్వత ప్రాతిపదికన భూ హక్కు కల్పిస్తోంది.

- వందేళ్ల తర్వాత భూముల రీ సర్వే
- అత్యాధునిక పరికరాలతో పకడ్బందీగా ప్రక్రియ
- వివాదాలకు తావులేకుండా చర్యలు
- తప్పులు దొర్లితే మ్యూటేషన్‌కు అవకాశం

**సాక్షి, చిత్తూరు :** గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఈ క్రమంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టారు. ఏళ్ల తరబడి సమస్యలను రీసర్వేతో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా వివిధ దశల్లో పకడ్బందీగా భూములను రీసర్వే చేయిస్తున్నారు. మొత్తం ప్రక్రియను కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



వి.కోట మండలం శివుని కుప్పంలో రీ సర్వేను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు (ఫైల్)

**శరవేగంగా రీ సర్వే ప్రక్రియ**

జిల్లాలో మొదటి దశ కింద రీసర్వే పూర్తయిన 130 గ్రామాల్లో సర్వే రాళ్లను సైతం నాటారు. సంబంధిత రైతులకు భూ హక్కు పట్టాలను అందజేశారు. రెండు, మూడో విడతల్లో శరవేగంగా సర్వే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ముందుగా డ్రోన్‌లతో సర్వే పూర్తి చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, సర్వే సిబ్బంది హద్దులు నిర్ణయించారు. రైతుల సమక్షంలో వివాదాలు లేకుండా సర్వే పూర్తి చేస్తున్నారు. పొరపాట్లు గుర్తిస్తే నిర్ణీత సమయంతో పరిష్కారం చేస్తున్నారు. తద్వారా భూ విస్తీర్ణాన్ని పక్కాగా నిర్ధారిస్తున్నారు. గ్రామ సభల్లో వచ్చిన అభ్యంతరాలు పరిశీలించి భూముల వివరాలను డిజిటలైజ్ చేస్తున్నారు.

**స్కాన్ చేస్తే చాలు..!**

జగనన్న సంపూర్ణ భూ హక్కు పత్రాల్లో క్యూ ఆర్ కోడ్, మ్యాపుల ఫొటోలు, విస్తీర్ణం, సర్వే నంబర్లతో సహా అన్ని వివరాలూ ముద్రిస్తున్నారు. క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సంబంధిత భూముల సమస్త వివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. భూ యజమాని, రైతులకు సంబంధించిన అన్ని వివరాలు అందులో పేర్కొంటున్నారు. భూ యజమానులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా హక్కు పత్రాలను సిద్ధం చేసి సర్వే పూర్తైన గ్రామాల్లో పంపిణీ చేశారు.

**మ్యూటేషన్‌కు అవకాశం**

రీసర్వేలో ఎక్కడైనా చిన్నపాటి తప్పులు దొర్లితే, మ్యూటేషన్ ద్వారా సరిదిద్దుకునే అవకాశం కల్పిస్తున్నారు. భూ సర్వే ప్రక్రియలో ఏ దశలో అభ్యంతరాలు వ్యక్తమైనా వాటిని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు.

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| మొత్తం మండలాలు 31 | రిజిస్ట్రేషన్‌కు సిద్ధంగా ఉన్నవి 69 |
| రెవెన్యూ డివిజన్లు 04 | రెండో విడతలో రీ సర్వే చేపట్టినవి 105 |
| గ్రామాలు : 823 | వివిధ దశల్లో ప్రక్రియ సాగుతున్నవి 226 |
| డ్రోన్ సర్వే పూర్తి అయినవి 781 | |
| తొలి విడతలో రీ సర్వే పూర్తైనవి 130 | |

**పారదర్శకంగా సర్వే**

జిల్లాలో పారదర్శకంగా రీ సర్వే చేసి, భూ యజమానులకు హక్కు పత్రాలు అందిస్తున్నాం. వాటిలో ఏమైనా సమస్యలున్నా, తప్పులు దొర్లినా సవరించుకునే అవకాశం కల్పించాం. సర్వే పూర్తయిన గ్రామాల్లో రాళ్లు నాటే ప్రక్రియ వేగంగా సాగుతోంది. భూ హక్కు పత్రాలు పొందిన రైతులు ఆయా గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.పైలట్ ప్రాజెక్టుగా రెండు గ్రామాల్లో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించాం.

– పి.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్, చిత్తూరు

**ఆనందంగా ఉంది**



మా గ్రామంలో సమగ్ర భూ సర్వే పూర్తయింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా భూ హక్కు పత్రాలు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది. గతంలో ఎప్పుడూ ఇలాంటివి చూడలేదు. ఈ సర్వే తో భూ సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి.

– నందకుమార్, సీవీ పల్లె, ఐరాల

**ఎంతో మేలుజరిగింది..**



రీ సర్వే కారణంగా మాకెంతో మేలు జరిగింది. గతంలో మా భూమికి హద్దులు చూపమని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగే వాళ్లం. ఇప్పుడు అలాంటి సమస్య లేకుండా అధికారులే పొలం వద్దకు వచ్చి మా భూమికి పక్కాగా హద్దులు చూపించి సరిహద్దు రాళ్లు నాటించారు. స్కెచ్‌ను సైతం ఉచితంగా అందజేశారు.

– ధనంజయ, గుట్టూరు, పెద్దపంజాణి మండలం

**సమస్యలకు పరిష్కారం**



ఏళ్ల తరబడి పేరుకుపోయిన భూ సమస్యలకు రీసర్వేతో పరిష్కారం లభించింది. ఇంతకుముందు రెవెన్యూ అధికారుల వద్దకు కాళ్లు అరిగిపోయేలా తిరిగినా ఫలితం ఉండేది కాదు. ప్రస్తుతం మాగ్రామంలో సర్వే చేయడంతో అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. నిజమైన హక్కు దారులను గుర్తించి భూ హక్కు పత్రాలు అందజేశారు.

– ఎ.రామమోహన్‌రెడ్డి, రైతు, మంగళం పంచాయతీ

**హద్దులు తెలిసాయి**



నాకు ఎకరం పొలం ఉంది. సాగు చేసుకుంటున్నా సరైన హద్దులు తెలిసేవి కాదు. మా గ్రామంలో ఇటీవల భూముల రీసర్వే చేశారు. భూమిలో పాతుకుపోయిన రాళ్లను సైతం బయటకు తీశారు. భూములకు సరిహద్దు నిర్ణయించి సర్వే రాళ్లు నాటారు. పాసు పుస్తకాలు అందజేశారు. ఇప్పుడు అందరికీ వారి భూముల హద్దులు తెలిసాయి.

– ఏలుమలై, తెరణి, నగరి మండలం

# గంజాయి విక్రేతల అరెస్ట్


అజమతుల్లా


మోహన్


రాహుల్

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న అజమతుల్లా (26), ఆర్కే మోహన్(25), రాహుల్(26) అనే నిందితులను వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. స్థానిక సంతపేటకు చెందిన అజమతుల్లా, మోహన్ జులాయిగా తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. తమిళనాడులోని గుడియాత్తం నుంచి గంజాయిను తీసుకొచ్చి చిత్తూరులో విక్రయిస్తున్నారు. వీరికి గుడియాత్తానికి చెందిన రాహుల్ సహకస్తున్నాడు. దీనిపై చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తికి సమాచారం అందడంతో వన్‌టౌన్ పోలీసులను అప్రమత్తం చేశారు. చిత్తూరు రైల్వే స్టేషన్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో నిందితులు ముగ్గురూ గంజాయిను ప్యాకెట్లుగా చేస్తుండగా పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 1.75 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులను రిమాండ్ నిమిత్తం జిల్లా జైలుకు తరలించారు.

# వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం


వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో నమోదైన వినతుల పరిష్కారానికి ఆయా శాఖాల అధికారులు ప్రాధాన్యమివ్వాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు వివిధ సమస్యలపై అందించిన అర్జీలను జేసీ స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు స్పందన వినతులను తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనకు మొత్తం 294 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

**పోలీసు స్పందనకు 24 ఫిర్యాదులు**

చిత్తూరు అర్బన్: నగరంలోని ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై పలువురు బాధితులు అందించిన వినతులను ఎస్పీ రిషాంత్‌రెడ్డి స్వీకరించారు. అనంతరం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో పోలీసు అధికారులతో మాట్లాడారు. ప్రజలు ఏదైనా సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వస్తే వెంటనే స్పందించాలన్నారు. ఎక్కడి సమస్యలను అక్కడే పరిష్కరిస్తే, బాధితులు చిత్తూరుకు వచ్చే అవకాశం ఉండదని తెలిపారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు కార్యాలయంలో స్పందనకు మొత్తం 24 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


చిత్తూరు బులియన్

| బంగారం : | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.60,000 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,460 |
| వెండి: | |
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.76,000 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.79.00 |

## స్కూటర్‌ను ఢీకొన్న ట్రాక్టర్

చంద్రగిరి(తిరుపతి రూరల్): పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి మండలం తొండవాడ బ్రిడ్జి వద్ద సోమవారం స్కూటర్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు తొండవాడకు చెందిన శ్రీను తిరుపతికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108 లో తిరుపతి రుయాకు తరలించారు.



# సకాలంలో పిల్లలకు టీకాలు


బ్యానర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పిల్లలకు సకాలంలో రోగనిరోధక టీకాలు వేయించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ టీకా ఇవ్వడం వల్ల డిఫ్తీరియా, పెర్టూస్యసిస్, టెటనస్, పోలియో, మీజిల్స్, బీసీజీ, టీబీ, హెపటైటీస్–బి, హిమోఫిలస్, డయేరియా, మంప్స్ వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించవచ్చన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటా సర్వే నిర్వహించి వ్యాధి నిరోధక టీకాలు వేసుకోని 0–5 ఏళ్ల లోపు పిల్లలను , గర్భిణీలను గుర్తించాలని స్పష్టం చేశారు. వందశాతం టీకాలను వేయించేందుకు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆగస్టు 7 నుంచి 12 వరకు మొదటి విడతగా, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు రెండో విడతగా, అక్టోబర్ 9 నుంచి 14 వరకు మూడో విడతగా స్పెషల్ డ్రైవ్ కింద టీకా కార్యక్రమంతో నిర్వహించాలని కోరారు. అనంతరం మిషన్ ఇంద్రధనుష్ 5.0 అవగాహన బ్యానర్‌ను ఆవిష్కరించారు.సమావేశంలో డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ రవిరాజు, డీపీఓ లక్ష్మి, మలేరియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఘనంగా విజయానందరెడ్డి జన్మదినోత్సవం


కుమార్‌స్వామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న విజయానందరెడ్డి


విజయానందరెడ్డికి ఆపిల్స్ మాల వేసిన అభిమానులు


విజయానందరెడ్డిను సన్మానిస్తున్న కేపీ శ్రీధర్, కార్పొరేటర్ పుష్పలత

చిత్తూరు అర్బన్ :ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం చిత్తూరు వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక బీవీ రెడ్డి కాలనీలోని నివాసంలో విజయానందరెడ్డిని వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం పార్టీ కార్యకర్తలు, అభిమానుల నడుమ ఆయన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు నోటు పుస్తకాలు, బ్యాగులు, ఇతర విద్యాసామగ్రిని విజయానందరెడ్డికి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో విజయానందరెడ్డి నివాసానికి పలువురు ప్రముఖులు చేరుకుని బర్త్‌డే విషెస్ తెలిపారు. వారిలో డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి వ్యాపారవేత్తలు భరత్ రెడ్డి, గురవారెడ్డి, ఆనందరెడ్డి, పార్టీ నాయకులు బీరేంద్రవర్మ, కేపీ శ్రీధర్, ధీరజ్‌రెడ్డి, రజనీకాంత్, అన్బు, సురేష్, అను, చందు, చక్రీ, రాజేష్‌రెడ్డి, వినోద్, బాలాజీ జ్యూలరీస్ అధినేత బాలాజీ, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పుష్పలత, నేతలు దళవాయి శివకుమార్, చిన్ని, సత్య, పరమేశ్వర్‌రెడ్డి, మురళీరెడ్డి, డేవిడ్, మధుబాబు, మాపాక్షి మోహన్, చంద్రయ్య, పట్టాభి, కార్పొరేషన్ కమిషనర్ అరుణ, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, సర్పంచ్ అమరనాథ్‌రెడ్డి, పార్టీ నేత పాండియన్, కుమారస్వామిరెడ్డి, మండీ ప్రభ ఉన్నారు. అలాగే విజయానందరెడ్డి అభిమానులు భారీగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేపట్టారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట–చౌడేపల్లె మార్గంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మంజన్‌కపాడి (25) మండలంలోని వీరప్పల్లి సమీపంలో ఉన్న కోళ్ల ఫామ్‌లలో కూలి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కెళవాతి బస్టాప్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 9 మందికి జైలు, జరిమానా


కోర్టు ఎదుట నిందితులతో పోలీసు

కుప్పంరూరల్ : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో 9 మంది నిందితులకు సోమవారం కుప్పం సివిల్ కోర్టు న్యాయమూర్తి భారతి రూ.2వేల చొప్పున జరిమానా, 2 రోజుల జైలుశిక్ష విధించినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపినా ఇదే శిక్ష ఉంటుందని సీఐ వెల్లడించారు. ఆయన వెంట ఎస్‌ఐ శివకుమార్ ఉన్నారు.

# గుండెపోటుతో సర్పంచ్ మృతి


నారాయణమూర్తి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: ముత్తువాళ్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, గుడిపాల సర్పంచ్ నారాయణమూర్తి(49) సోమవారం సాయంత్రం మృతి చెందారు. గంగాసాగరంలోని సిమెంట్ బ్రిక్స్ ఫ్యాక్టరీ వద్దకు వెళ్లిన ఆయనకు హఠాత్తుగా ఛాతీలో నొప్పి రావడంతో చిత్తూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నారాయణమూర్తి భౌతికకాయాన్ని స్వగ్రామానికి తరలించారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రజనీకాంత్, మధుసూదన్‌రాయల్, గోళ్ల హరిప్రసాద్, రమేష్, కారిమేగస్ ఉన్నారు.

## ఏడవమైలు వద్ద దుకాణాల ఏర్పాటుపై ఉద్రిక్తత

తిరుమల: అలిపిరి కాలినడక మార్గంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద సోమవారం ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళితే.. తిరుమల–అలిపిరి నడకమార్గంలోని ఏడవమైలు వద్ద అటవీ అధికారులు అక్రమంగా దుకాణాలను కేటాయిస్తున్నారని దుకాణదారులు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడకు చేరుకున్న టీటీడీ రెవెన్యూ అధికారులు, ఈవో ఆదేశాల మేరకు దుకాణాలు నిర్వహించాలని అటవీ అధికారులకు సూచించారు. అయితే నడక మార్గం టీటీడీ పరిధిలో లేదని ఇది అటవీశాఖకు సంబంధించిన స్థలమని టీటీడీ అధికారులను నిలదీశారు. దీంతో టీటీడీ రెవెన్యూ అధికారులు, అటవీ శాఖ అధికారుల మధ్య కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. స్థానిక దుకాణదారులు మాట్లాడుతూ, తాము పాతికేళ్ల నుంచి ఇక్కడే వ్యాపారం చేస్తున్నామన్నారు. ఇప్పుడు అటవీ శాఖ అధికారులు వచ్చి, నిబంధనలకు విరుద్ధమంటూ దుకాణాలను తొలగించాలని చెప్పడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

# సామాజిక రుగ్మతల నిర్మూలనకు కృషి


మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు అగ్రికల్చర్: సామాజిక రుగ్మతల నిర్మూలనకు స్వయం సహాయక సంఘాల సభ్యులు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాసదన్ కార్యదర్శి కరుణకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో ఇప్పటికీ పలు ప్రాంతాల్లో మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళ సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పనిచేయాలని సూచించారు. చట్టాలపై మహిళలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కోరారు. మండల లీగల్ సర్వీస్ కమిటీల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ తులసి పాల్గొన్నారు.

# ప్రజలు సంతృప్తి చెందేలా ‘చెబుదాం’


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందించే అర్జీలకు ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ వినతులను మండల స్థాయిలోనే పరిష్కారమయ్యేలా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదారుడుతో మాట్లాడాలని కోరారు. మండలాల వారీగా ఈకేవైసీని వందశాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సేవా రుసుమును పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు జమ చేయాలని తెలిపారు. ఈనెల 29వ తేదీన డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను అప్లోడ్ చేయాలని సూచించారు.

**శానిటేషన్‌కు ప్రాధాన్యత**

జిల్లా వ్యాప్తంగా శానిటేషన్ పనులకు ప్రాధాన్యతనివ్వాలని జేసీ ఆదేశించారు. 56వ ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ విద్యార్థుల స్కాలర్ షిప్ సమస్యను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ ,డ్వామా పీడీలు తులసి, గంగాభవానీ, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఇరిగేషన్ ఎస్‌ఈ విజయ్ కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి మురళీకృష్ణ, డీపీఓ లక్ష్మి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి, డీఎస్‌ఓ శంకరన్, సీపీఓ ఉమాదేవి, డీఎల్‌డీఓ రవికుమార్, మలేరియా నివారణాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నేత కార్మికులకు కేంద్రం సాయం


మీడియాతో మాట్లాడుతున్న అధికారులు

నారాయణవనం: స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా ఆధునిక పరిజ్ఞానంతో తయారు చేసిన నూలు ఉత్పత్తులను స్వయంగా విక్రయించుకునే సౌకర్యాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందని స్ఫూర్తి ప్రోగ్రాం డైరెక్టర్ ఎస్ఎల్ఎన్ కుమార్ అన్నారు. నారాయణవనం క్లస్టర్‌లో ఇదివరకే నమోదు చేసుకున్న వెయ్యిమంది నేత కార్మికుల వ్యక్తిగత పత్రాలను ఆయన సోమవారం పరిశీలించారు. వినాయకస్వామి కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో కుమార్ మాట్లాడుతూ మండలంలోని నారాయణవనం, పాలమంగళం, పుత్తూరు మండలం గొల్లపల్లిలో హ్యాండ్లూమ్ క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో క్లస్టర్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లను మంజూరు చేస్తుందన్నారు. వస్త్రాల తయారీకి, రంగుల అద్దకానికి అవసరమైన యంత్రాలను సమకూర్చి, తయారైన వస్త్రాల మార్కెటింగ్‌కు రాష్ట్రవ్యాప్తంగా స్టాళ్లను ఏర్పాటు చేయించి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.

**20 క్లస్టర్ల ఏర్పాటు**

సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 20 క్లస్టర్లను కేంద్ర ప్రభుత్వ సహకారంతో క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలో చేనేత, శ్రీకాళహస్తిలో కలంకారి, పాపానాయుడుపేటలో పూసల తయారీ క్లస్టర్ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. నారాయణవనంలో ఒక ఎకరా స్థలాన్ని రెవెన్యూ శాఖ ఇప్పటికే కేటాయించిందని తెలిపారు. ఒక క్లస్టర్‌కు కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులను సమకూరిస్తే, సభ్యులు 10 శాతాన్ని భరించి, నైపుణ్యాన్ని మెరుగుపరచుకుంటూ చేనేత ఉత్పత్తులను తయారు చేసుకునే సౌలభ్యం ఉంటుందన్నారు. మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి మాట్లాడుతూ మరమగ్గ కార్మికులకు తమిళనాడు తరహాలో 300 యూనిట్ల విద్యుత్ రాయితీ ఇవ్వాలని సూచించారు. నేత కార్మిక సంఘం నాయకుడు గురుస్వామి మాట్లాడుతూ ప్రతి చేనేత కార్మికునికి నెలకు కనీసం వంద యూనిట్ల విద్యుత్ సబ్సిడీ ఇస్తే ఎంతో మేలు చేసిన వారవుతారని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నమోదు చేసుకున్న నేత కార్మికుల వ్యక్తిగత పత్రాలను వైఎస్సార్ క్రాంతి పథం ఏపీడీ ప్రభావతి నేతృత్వంలో ఏపీఎం మమత, సీసీలు నాగేంద్ర, రాజేశ్వరి, సురేష్, అకౌంటెంట్ మల్లిక తదితరులు పరిశీలించారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, డీఆర్‌డీఏ లైవ్‌లీ హుడ్ అధికారి ఆదినారాయణ, ఎంపీడీవో గుణశేఖర్ పాల్గొన్నారు.